యువత క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలి



సిద్దిపేటలో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



సోలిపేట సతీశ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 29 : యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకొని రేపటి తరాలకు ఆదర్శంగా నిలవాలని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సూచించారు. సోమవారం సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో నంగునూరు మండలం పాల మాకుల గ్రామంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి టీహెచ్‌ఆర్ వాలీబాల్ టోర్నమెంట్ సీజన్-2లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. విజేతగా నలిచిన పాల మాకుల టీమ్, రన్నరప్‌గా నిలిచిన చందులాపూర్ జట్టుకు ట్రోఫీలతోపాటు నగదు బహుమతి అందజేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

సిద్దిపేట, జనవరి 29 : నియోజకవర్గంలోని పలువురు మృతుల కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం పరామర్శించారు. పట్టణంలోని 15వ వార్డు ఇమాంబాద్‌కు చెందిన నాయిని మహేందర్‌రెడ్డి కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మల్లేశం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన సతీశ్‌రెడ్డి

దుబ్బాక టౌన్, జనవరి 29: బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. సోమవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావును సతీశ్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా సతీశ్‌కు ఎమ్మెల్యే మిఠాయి తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పర్స కృష్ణ, పడాల నరేశ్, మూర్తిశ్రీనివాస్‌రెడ్డి, మల్లేశంగౌడ్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలి

చేర్యాల, జనవరి 29: ఇండ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే 120 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో డిమాండ్ చేశారు. పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం చేర్యాల తహసీల్దార్ రాజేశ్వర్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వెంకట్ మావో మాట్లాడుతూ ఇంటి స్థలం ఉన్నవారికి గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని, స్థలం లేనివారికి 120 గజాల స్థలాన్ని కేటాయించాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్, గర్నెపల్లి చంద్రం, పాల వెంకటేశం, యాడారం బ్రహ్మయ్య, చెవిటి సిద్ధులు, బీమరాజు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంపై నిరంతర పోరాటం

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్

గజ్వేల్, జనవరి 29 : ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. సోమవారం గజ్వేల్ టీఎన్జీవో భవనంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తున్న ఏకైక సంఘం తమదేనన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. గజ్వేల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ రాష్ట్రంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. ఇక్కడ పని చేసిన ఉద్యోగుల కృషి, పట్టుదలతో జిల్లాకు అనేక అవార్డులు, రివార్డులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రంరెడ్డి, గజ్వేల్ అధ్యక్షుడు లింగం, ఉద్యోగులు సురేందర్‌రెడ్డి, అహ్మద్, శివప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేట, జనవరి 29: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై అధికారులు సానుకూలంగా వ్యవహరించడంతోపాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 27 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే అధికారులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా పాల్గొన్నారు.

సిద్దిపేట: దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

చిన్నారులను అభినందిస్తున్న గరీమా అగర్వాల్

కిక్ బాక్సింగ్‌లో రాణించడం అభినందనీయం

సిద్దిపేట కమాన్, జనవరి 29: ఉమెన్స్ కిక్ బాక్సింగ్‌లో చిన్నారులు రాణించడం అభినందనీయమని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. ఇటీవల హైదరాబాద్ ఎల్బీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ పోటీల్లో మెడల్స్ సాధించిన చిన్నారులు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లాకు మంచిపేరు తేవాలన్నారు. అదనపు కలెక్టర్ చేతులమీదుగా చిన్నారులు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, జనరల్ సెక్రటరీ భాగ్యరాజ్, డీవైఎస్‌వో నాగేందర్‌కుమార్, కిక్‌బాక్సింగ్ అడ్వైజర్ చంద్రం, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

కార్పొరేట్ మతతత్వ విధానాలను వ్యతిరేకించాలి

గజ్వేల్, జనవరి 29: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. సోమవారం ప్రజ్ఞాపూర్ రాణే పరిశ్రమలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సందర్భంగా రాములు మాట్లాడుతూ ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దు చేసిందని, యాజమాన్యాలకు ఉపయోగపడే విధంగా నాలుగు కార్మిక చట్టాలను రూపొందించిందన్నారు. దీంతో పరిశ్రమల్లో యూనియన్లు ఏర్పాటు చేయకుండా కుట్ర చేస్తుందన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు రైల్వే, బ్యాంకులు, ఎల్ఐసీ, పోర్టులు తదితర విలువైన జాతీయ ఆస్తులను తక్కువ ధరకు అంబానీ, ఆదానీలకు కట్టబెడుతున్నారని తెలిపారు. తొమ్మిదేండ్లలో రూ.14.23 లక్షల కోట్లను కార్పొరేట్ సంస్థలకు రాయితీలుగా ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు వేణుగోపాల్, స్వామి, భిక్షపతి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ భాషపై విద్యార్థులకు పోటీలు

దుబ్బాక టౌన్, జనవరి 29 : విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు దుబ్బాక మండల స్థాయిలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు నిర్వహించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లిష్ భాషలో స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో ప్రభుదాస్ హాజరై ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. పోటీల్లో మొదటి స్థానంలో బి.శ్రీవర్ష (దుబ్బాక), కె.శ్రీజ (లచ్చపేట), రెండో స్థానంలో కె.ప్రీతి (ఆకారం), టి.అక్షయ (కేజీబీవీ దుబ్బాక) గెలుపొందారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వంగ సత్యనారాయణ, శ్రీనివాసరావు, నిర్వాహకులు ముజీబ్‌అలీ, ఉమామహేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

హుస్నాబాద్ టౌన్, జనవరి 29: హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డులోని ఐదు గిరికల బావి స్థలంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను కూల్చివేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎంఆర్ రాజశేఖర్ తెలిపారు. గిరికల బావికి చెందిన స్థలంలో అక్రమంగా గోడను నిర్మించారని స్థానికులు గతంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మున్సిపల్ నుంచి నోటీసులు జారీ చేయడం చేశారు. అయినా ఇంటి యజమాని స్పందించక పోవడంతో సోమవారం మున్సిపల్ అధికారులు అక్రమంగా నిర్మించిన గోడను కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా సెట్‌బ్యాక్ కాకుండా స్లాబ్ వేశారని, గిరికల బావి స్థలాన్ని అక్రమించి ప్రహరీ నిర్మించారని నిర్ధారించిన తర్వాతే కూల్చివేశామని తెలిపారు.

చేర్యాల పాలశీతలీకరణ కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న పాడి రైతులు

పాలకేంద్రం ఎదుట రైతుల ఆందోళన

చేర్యాల, జనవరి 29: అధికారులు తీరును నిరసిస్తూ సోమవారం పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రం ఎదుట ధూళిమిట్ట, జాలపల్లి తదితర గ్రామాలకు చెందిన పాడి రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పాడి రైతులు మాట్లాడుతూ ఆవు పాలల్లో ఉప్పు, చక్కెర వస్తుందని పాలకేంద్రం అధికారులు పాలు తీసుకునేందుకు నిరాకరించడంతో వ్యవసాయ పొలాల్లో పారబోస్తున్నామని తెలిపారు. పాలను కల్తీ చేయకున్నా ఉప్పు, చక్కెర కలిపినట్టు ల్యాబ్ పరీక్షల్లో రావడం ఏంటని ప్రశ్నించారు. పరీక్షలు చేసే యంత్రాలు, కెమికల్ నకిలీవన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారికి ఫోన్ చేసి చెప్తే రైతులు న్యూసెన్స్ చేస్తున్నారని, ఆందోళన చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని సిబ్బందికి చెప్పడం దారుణమన్నారు. రెండు నెలలుగా పాల బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేత

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 29: తమ సమస్యలు పరిష్కరించాలని నాయీబ్రాహ్మణుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఉమ్మడి మద్దూరు మండల అధ్యక్షుడు కొండూరి సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో నాయీబ్రాహ్మణులు కలిసి వినతిపత్రం అందజేశారు. సతీశ్‌కుమార్ మాట్లాడుతూ కులవృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న నాయీబ్రాహ్మణులకు కులవృత్తిపై పేటెంట్ హక్కులు కల్పించాలన్నారు. నాయీబ్రాహ్మణుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ లేదా ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నాయీబ్రాహ్మణ కుటుంబాలలోని మహిళలకు ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లుగా అవకాశం కల్పించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధికార ప్రతినిధి, విద్యాకర్, జిల్లా మాజీ అధ్యక్షుడు నరేందర్, నాయకులు స్వామి, శ్రీనివాస్, కనకయ్య, వెంకటస్వామి ఉన్నారు.

విద్యారంగంలో రాష్ట్రంలోనే సిద్దిపేట ఆదర్శం

ఎన్సాన్‌పల్లి హైస్కూల్లో డిజిటల్ కంటెంట్ పుస్తకాలు పంపిణీ చేసున్న నాయకులు

సిద్దిపేట నెట్‌వర్క్, జనవరి 29 : విద్యారంగంలో రాష్ట్రంలోనే సిద్దిపేట ఆదర్శంగా నిలిచిందని విద్యార్థి, యువజన విభాగం నాయకులు అన్నారు. సోమవారం బీఆర్ఎస్ యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నంగునూర్ మండలం అక్కెనపల్లి మోడల్ స్కూల్, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి రెసిడెన్షియల్ స్కూల్, జిల్లా పరిషత్ పాఠశాల, నారాయణరావు జిల్లా పరిషత్ పాఠశాల, లక్ష్మీదేవిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే హరీశ్‌రావు తన సొంత ఖర్చులతో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. పిల్లలు చదువుకునేలా తల్లిదండ్రులకు ఉత్తరం పంపారన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, సోమిరెడ్డి, రమేశ్‌గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఎల్లం, సర్పంచ్ రవి, ఎంపీటీసీ ప్రశాంత్‌గౌడ్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, మండల అధ్యక్షుడు ఆకుల సతీశ్, ఎంపీపీ బాలమల్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొనయ్యగారి ఎల్లయ్య, గ్రామ అధ్యక్షుడు దేవరాజు, బుగ్గ రాజేశ్వర ఆలయ చైర్మన్ కిషన్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు స్వప్నాప్రభాకర్, సోషల్ మీడియా కన్వీనర్ కమల్‌యాదవ్ పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు

దుబ్బాక టౌన్: కరాటే పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా విద్యార్థులు

సాధించిన మెడల్స్‌తో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు

దుబ్బాక టౌన్, జనవరి 29 : అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటినట్లు యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు, కోచ్ బురాని శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరల్డ్ నకయామ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 28న హైదరాబాద్‌లో జరిగిన రెండో అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన 33 మంది విద్యార్థులు పతకాలు సాధించినట్లు తెలిపారు. సుమారు 30 దేశాలకు చెందిన 3 వేల మంది విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొనగా, జిల్లాకు చెందిన విద్యార్థులు 14 గోల్డ్ మెడల్స్, 19 సిల్వర్ మెడల్స్ సాధించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీఈసీవో ముక్తేశ్వరి అభినందించారు.

మెడల్స్ సాధించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు

మిరుదొడ్డి, జనవరి 29 : అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మిరుదొడ్డి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారని ఆ పాఠశాల ప్రత్యేకాధికారి స్వర్ణలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరల్డ్ నకమయా షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రెండో అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 30 దేశాలకు చెందిన 3 వేల మంది క్రీడాకారులు పాల్గొనగా, మిరుదొడ్డి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారని తెలిపారు. 8 మంది విద్యార్థినులు గోల్డ్ మెడల్స్, 9 మంది సిల్వర్ మెడల్స్ సాధించారని వివరించారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 29: కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ డిమాండ్ చేశారు. సోమవారం ధూళిమిట్ట మండల కార్యాలయంలో మండల కమిటీ సభ్యుడు భాస్కర్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాలన్నారు. ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తుల ఆధారంగా అర్హులైన నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పెన్షన్లు, రేషన్‌కార్డులు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు రవికుమార్, సత్యనారాయణ, ప్రసాద్, మహేశ్, రాజు, నరేశ్, సిద్ధులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- కార్మిక సంఘాల నాయకుల పిలుపు

సిద్దిపేట, జనవరి 29 : కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందని, మోదీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం సిద్దిపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఆర్టీయూ, హెచ్ఎంఎస్ కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని, ఫిబ్రవరి 16న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కుదించి కేంద్రం నాలుగు కార్మిక చట్టాలు తీసుకొచ్చిందని, వీటివల్ల కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, బీఆర్టీయూ జిల్లా నాయకులు బాలు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, కనకయ్య, మదాసు రాములు పాల్గొన్నారు.

సిద్దిపేట సీపీ అనురాధకు మొక్క అందజేస్తున్న సీఐ ఉపేందర్

సిద్దిపేట టూటౌన్ సీఐగా ఉపేందర్

సిద్దిపేట టౌన్, జనవరి 29 : సిద్దిపేట టూటౌన్ సీఐగా ఉపేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధను సీఐ కలిసి మొక్క అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవలందించాలని తెలిపారు.

గజ్వేల్ టౌన్ సీఐగా సైదా బాధ్యతలు స్వీకరణ

గజ్వేల్, జనవరి 29 : గజ్వేల్ టౌన్ సీఐగా బి.సైదా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జాన్‌రెడ్డి బదిలీపై ఐజీ కార్యాలయానికి వెళ్లగా, ధర్‌పల్లి సీఐగా విధులు నిర్వహిస్తున్న బి.సైదా గజ్వేల్ టౌన్ సీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐకి స్వాగతం, బదిలీపై వెళ్తున్న సీఐ జాన్‌రెడ్డికి పోలీస్ సిబ్బంది వీడ్కోలు పలికారు.

చేర్యాల సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీను

చేర్యాల, జనవరి 29: చేర్యాల సీఐగా ఎల్.శ్రీను బాధ్యతలు స్వీకరించారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పర్యవేక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తానని సీఐ చెప్పారు. శాంతిభద్రతల విషయంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

సీపీని కలిసిన తొగుట సీఐ

తొగుట, జనవరి 29: నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌కే లతీఫ్ పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధను కలెక్టరేట్‌లో కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సీఐకి సూచించారు.

పంట పొలాలను సందర్శించిన అధికారులు

చేర్యాల, జనవరి 29: మండలంలోని నాగపురి గ్రామంలో పొలాలను చేర్యాల వ్యవసాయ శాఖ డివిజన్ అధికారి రాధిక సందర్శించారు. ఈ సందర్భంగా పొలాల్లో మొగి పురుగు, కాండం తొలుచు పురుగు ప్రభావాన్ని చూసి రైతులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట నాగపురి రైతు సేవా ఏపీసీ చైర్మన్ జక్కుల తిరుపతి, సీఈవో రాజశేఖర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

కొమురవెల్లి మండలంలో...

కొమురవెల్లి, జనవరి 29: మండలంలోని ఐనాపూర్, పోసాన్‌పల్లి గ్రామాల్లో వరి పొలాలను సోమవారం మండల వ్యవసాయాధికారి మరుపాక నరేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో కాండం తొలిచే పురుగు(మొగి పురుగు) ఉధృతి నివారణకు రైతులు నాటు వేసిన 15 నుంచి 20 రోజుల్లోపు కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కిలోల లూదాకార్ టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8 కిలోలు చల్లుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈవో నాగరాజు, రైతులు ఉన్నారు.

ప్రశంసా పత్రాలు అందుకున్న పాఠశాల విద్యార్థులు

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేత

కొండపాక, జనవరి 29: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, చెకుముకి మండల ప్రధాన కార్యదర్శి శోభారాణి ఆధ్వర్యంలో సోమవారం చెకుముకి మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో కొండపాక జడ్పీహెచ్ఎస్, ద్వితీయ స్థానంలో ఖమ్మంపల్లి జడ్పీహెచ్ఎస్, తృతీయ స్థానంలో తిమ్మారెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లు నిలిచాయి. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ బాలిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్‌నాయక్, ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట టౌన్, జనవరి 29 : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో సిద్దిపేట శ్రీవాణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సత్యం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

గుణాత్మకమైన విద్యనందించాలి

మిరుదొడ్డి, జనవరి 29 : విద్యార్థులకు రుచికరమైన భోజనం పెడుతూ గుణాత్మకమైన విద్యనందించాలని ఎంపీపీ సాయిలు, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు సూకరి లింగం ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం అల్వాల-చెప్యాల గ్రామాల శివారుల్లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను ఉపాధ్యాయులు ఉన్నతులు